కేసీఆర్‌ను కలిసిన గిరిజన నాయకుడు

కేసీఆర్‌కు చిత్రపటాన్ని అందజేస్తున్న రాజునాయక్

అక్కన్నపేట, ఏప్రిల్ 4: అక్కన్నపేట మండలానికి చెందిన గిరిజన సంఘం రాష్ట్ర నాయకుడు గుగులోతు రాజునాయక్ తన పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం గులాబీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేసీఆర్ ఆశీస్సులు తీసుకొని చిత్రపటాన్ని అందజేశారు.

రేణుకా ఎల్లమ్మ ఆలయంలో మాజీ ఎమ్మెల్యే పూజలు

రేణుకాఎల్లమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న వొడితెల సతీశ్‌కుమార్

హుస్నాబాద్‌టౌన్, ఏప్రిల్ 4: హుస్నాబాద్‌లోని రేణుకా ఎల్లమ్మ ఆలయాన్ని శుక్రవారం సాయంత్రం మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్ కుమార్ దర్శించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే బొప్పరాజులక్ష్మీకాంతారావు కుమారులు రాజేశ్వర్‌రావు, సంజీవరావు ఆధ్వర్యంలో ఆలయంలో చండీయాగం నిర్వహించి అనంతరం వెండి కవచధారణ చేశారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో టీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు ఎండీ అన్వర్, మండల అధ్యక్షుడు గంగం మధుకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, బీఆర్ఎస్ నాయకులు అయిలేని మల్లికార్జున్‌రెడ్డి, భాగ్యారెడ్డి, రవి, హరీశ్, మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ నిరుపేదలకు వరం

రాయపోల్, ఏప్రిల్ 4: సీఎంఆర్‌ఎఫ్ నిరుపేదలకు వరంలాంటిదని బీఆర్‌ఎస్ దుబ్బాక నియోజకవర్గ సమన్వయకర్త రణం శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శుక్రవారం దౌల్తాబాద్ మండలం ఇందుప్రియాల్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు పోతరాజు స్వామికి రూ.60వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ఆయన అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ నిరుపేదలకు సీఎంఆర్‌ఎఫ్ ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వీరమ్మ మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

పేదరికాన్ని జయించిన శ్వేత స్ఫూర్తిదాయకం

తొగుట, ఏప్రిల్ 4: పేదరికాన్ని జయించిన డాక్టర్ శ్వేత స్ఫూర్తిదాయకమని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని వెంకట్రావుపేట గ్రామా నికి చెందిన పోతరాజు యాదగిరి–భాగ్య కుమార్తె డాక్టర్ శ్వేత ఎంబీబీఎస్ పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం ఆమెను సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్‌ను స్ఫూర్తిగా తీసుకొని ప్రతి కుటుంబంలో ఒక శ్వేత తయారు కావాలన్నారు. నాయకులు పెంటోజి, వెంకటయ్య, స్వామిగౌడ్, పోతరాజు రవీందర్, పాత్కుల బాలేశ్, ఈదుగాళ్ల పరశురాములు, పులిగారి లక్ష్మణ్, సుతారి రాంబాబు, పోతరాజు స్వామి, సయ్యద్ అజాం, శేఖర్, రాజు పాల్గొన్నారు.

భగవద్గీత శ్లోకాల పోటీల్లో బంగారు పతకాలు

బంగారు పతకాలు సాధించిన మాధవి, ప్రణీత

చేర్యాల, ఏప్రిల్ 4: హైదరాబాద్‌లో దత్త పీఠం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన భగవద్గీత పోటీలో పట్టణానికి చెందిన మాధవి, ప్రణీత బంగారు పతకాలు, ధ్రువీకరణ పత్రాలు పొందారు. ఇరువురు మహిళలు 700 శ్లోకాలు కంఠస్థం చేసి పోటీలో పాల్గొని విజేతలుగా నిలిచారు. గణపతి సచ్చిదానందస్వామి నుంచి బంగారు పతకాలు అందుకున్నారు. పట్టణానికి చెందిన మాధవి, ప్రణీత బంగారు పతకాలు సాధించడంపై పలువురు అభినందనలు తెలిపారు.

అంబరాన్నంటిన 'వార్షికోత్సవ' సంబురం

రేబర్తి హైస్కూల్ వార్షికోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఎంఈవో వరదరాజు

మద్దూరు(ధూళిమిట్ట), ఏప్రిల్ 4: మద్దూరు మండలంలోని రేబర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవం శుక్రవారం రాత్రి నిర్వహించారు. వార్షికోత్సవాన్ని మద్దూరు మండల విద్యాశాఖ అధికారి వరదరాజు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం చంద్రభాను అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంఈవో మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి, ఉన్నత లక్ష్యాలకు చేరుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో చేర్యాల, ధూళిమిట్ట ఎంఈవోలు రచ్చ కిష్టయ్య, మాడిశెట్టి మీనాంజనేయులు, రిటైర్డు ఎంఈవో మొగుళ్ల నర్సింహారెడ్డి, పంచాయతీ కార్యదర్శి మాధవ్‌జాదవ్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు బానిసకావద్దు

బెజ్జంకి, ఏప్రిల్ 4: విద్యార్థులు కష్టపడితేనే ఉన్నత లక్ష్యాలు చేరుకుంటారని ఎంపీడీవో ప్రవీణ్ సూచించారు. మండల కేంద్రం పరిధిలోని ఎల్లంపల్లి మోడల్ స్కూల్ వార్షికోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిలై జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో మహతిలక్ష్మి, ప్రిన్సిపాల్ సంగీత, సెక్టోరియల్ అధికారి రంగనాథ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటలు, పాటలు నేర్పించాలి

మాట్లాడుతున్న డీఈవో శ్రీనివాస్‌రెడ్డి

కొండపాక(కుకునూరుపల్లి), ఏప్రిల్ 4: సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థుల్లో సృజనాత్మకత పెరుగుతుందని జిల్లా విద్యాధికారి ఎల్లంకి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం రాత్రి కొండపాక మండలం దుద్దెడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులకు చదువుతో పాటు ఆటలు, పాటలు నేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, హెచ్‌ఎం బాలయ్య, ఎంఎన్‌వో విఠల్, యాదగిరి, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

భారీ వర్షంతో దెబ్బతిన్న పంటలు

ధర్మారెడ్డిపల్లిలో మొక్కజొన్నను పరిశీలిస్తున్న బాబునాయక్, నాగరాజు

గజ్వేల్, ఏప్రిల్ 4: మండలంలోని ఆయా గ్రామాల్లో గురువారం కురిసిన భారీగా వర్షానికి రైతులు సాగు చేసిన పంటలు దెబ్బతిన్నాయి. మొక్కజొన్న, వరి పంటలు నెలకొరిగాయి. కూరగాయల పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. మండలంలోని ధర్మారెడ్డిపల్లి, సంగుపల్లి, కోమటిబండ, జాలిగామ, గజ్వేల్ పట్టణ శివారు ప్రాంతాల్లో ఏడీఏ బాబునాయక్, ఏవో నాగరాజు పంటలను పరిశీలించి వివరాలు సేకరించారు. ఆయా గ్రామాల్లో మొక్కజొన్న 54 ఎకరాలు, వరి 126 ఎకరాల్లో దెబ్బతిన్నట్లు అధికారులు తెలిపారు. ఏఈవో నలీన్, రైతులు పాల్గొన్నారు.

ఉత్సవాల కమిటీ కన్వీనర్‌గా సాయన్న

హుస్నాబాద్‌టౌన్, ఏప్రిల్ 4: మహనీయుల జయంతి ఉత్సవాల కమిటీ సమావేశం శుక్రవారం మండల కేంద్రంలో జరిగింది. ఈ సందర్భంగా దళిత సంఘాలు, ప్రజాసంఘాలకు చెందిన పలువురు సమావేశానికి హాజరయ్యారు. సమావేశంలో భాగంగా ఉత్సవాల కమిటీ కన్వీనర్‌గా లింగాల సాయన్న, కో కన్వీనర్లుగా కొమ్ముల భాస్కర్, పచ్చిమట్ల రవీందర్‌గౌడ్, తొండూరి ఎల్లయ్య, కండె సుధాకర్, కొయ్యడ కొమురయ్య, బొజ్జ హరీశ్, బత్తుల శంకర్‌బాబు, కొడముంజ రమేశ్, సింగరి, వినోద్, ఇంతియాజ్, అశోక్, గాదాసు రామ్‌ప్రసాద్, తిప్పర్తి శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు. గౌరవ సలహాదారులుగా కేడం లింగమూర్తి, గాదపాక రవీందర్, ఎనగందుల లక్ష్మీనారాయణ, వరయోగుల అనంతస్వామి ఎన్నికయ్యారు. కోఆర్డినేటర్‌గా ముక్కెర సంపత్‌కుమార్, సాంస్కృతిక కార్యదర్శులుగా గడిపెబాలయ్య, చిన్నబాలు, కనకం వెంకట్‌ను ఎన్నుకున్నారు.

కేసీఆర్ దీవెనలతో సిద్దిపేట అభివృద్ధి

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు
- సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు, కలెక్టర్ మనుచౌదరితో పలు అంశాల గురించి మాట్లాడుతున్న హరీశ్‌రావు

సిద్దిపేట,ఏప్రిల్ 4: గులాబీ అధినేత కేసీఆర్ దీవెనలతో సిద్దిపేట అభివృద్ధి చెందిందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 260 మందికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేసీఆర్ కృషితో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా నియోజకవర్గంలో 52వేల ఎకరాల్లో పంటలు పండుతున్నాయన్నారు. కాళేశ్వరం నీటితో సిద్దిపేట సస్యశ్యామలం అయ్యిందన్నారు. 25 ఏండ్ల క్రితం తాగునీటికి సిద్దిపేట ప్రజలు అష్టకష్టాలు పడ్డారని కేసీఆర్ సిద్దిపేటకు నీళ్లు తెచ్చి ప్రజల కష్టాలు తీర్చారన్నారు. సిద్దిపేటను అభివృద్ధిలో రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దామన్నారు. కేసీఆర్ కృషి వల్ల కరీంనగర్ నుంచి సిద్దిపేట, ఢిల్లీ, బెంగళూరు, తిరుపతి వరకు రైలు సదుపాయం కలిగిందన్నారు. కాంగ్రెస్ పాలనలో అన్ని రంగాలు దెబ్బతిన్నాయన్నారు. రేవంత్‌రెడ్డి పాలన సగం సగం.. ఆగమాగంలా తయారైందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో హామీ ఇచ్చిన తులం బంగారం లేదు.. స్కూటీ లేదు... కేసీఆర్ కిట్, రూ. 4000 పెన్షన్ లేదు, మహిళలకు రూ. 2500 ఇవ్వలేదన్నారు. పంట రుణ మాఫీ చేయలేదని, రైతుబంధు ఎగబెట్టారని గుర్తు చేశారు. సిద్దిపేటకు మళ్లీ పూర్వ వైభవం వస్తుందని, అందరినీ కంటికి రెప్పలా కాపాడుకుంటానన్నారు.

కొనుగోలు కేంద్రాలు కొనసాగించాలి

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 4 : చిన్నకోడూరులో పొద్దుతిరుగుడు సాగు చేసిన రైతులు ఆందోళనలో ఉన్నారని, కొనుగోలు కేంద్రాలు కొనసాగించేలా చొరవ చూపాలని కలెక్టర్ మనుచౌదరిని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు కోరారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ మనుచౌదరితో ఆయన సమావేశమై పలు అంశాలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లోభాగంగా భూసేకరణ విషయంలో జాప్యం జరుగుతుందని, వెంటనే పెండింగ్‌లో ఉన్న కాలువల భూసేకరణ పనులు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించాలని కలెక్టర్‌ను కోరారు. నియోజకవర్గంలో ఈ యాసంగి పంటకు 50 వేల ఎకరాలకు సాగునీరు అందిందని, ఇంకా ఆయకట్టు పెంచే దిశగా భూసేకరణ చేయాలని, దీంతో రైతులకు మేలు జరుగుతుందన్నారు.

పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలి

మాట్లాడుతున్న మంత్రి ప్రభాకర్‌గౌడ్

హుస్నాబాద్‌టౌన్, ఏప్రిల్ 4: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని బీసీ సంక్షేమం, రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ సూచించారు. హుస్నాబాద్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత బాలికల పాఠశాల వార్షికోత్సవం శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నామని, కార్పొరేట్‌కు దీటుగా పాఠశాలలను తయారు చేయాలన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న, కమిషనర్ మల్లికార్జున్‌గౌడ్, ఎంఈవో బండారి మనీల, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటయ్య, ఉపాధ్యాయులు నరేందర్, మహేందర్, రవీందర్, వనమాల, యుగేందర్‌రెడ్డి, సాంబశివరెడ్డి, ప్రతాప్, రాజయ్య, మోహన్, రవి పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు కలుగొద్దు

బస్వపూర్‌లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన కలెక్టర్

కోహెడ, ఏప్రిల్ 4: మండలంలోని బస్వపూర్‌లో శుక్రవారం కలెక్టర్ మనుచౌదరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్యాడీ క్లీనర్లు, విద్యుత్ సౌకర్యం, గన్నీ బ్యాగులు, టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలన్నారు. వర్షం వస్తే ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు సూచించారు. మండలంలోని తంగళ్లపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బోయిన నిర్మల ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో వైస్ చైర్మన్ తిరుపతిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ధర్మయ్య, మాజీ సర్పంచ్ పాము నాగేశ్వరి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హాస్టల్‌ను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్

హాస్టల్ నిర్వాహకులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గరిమాఅగర్వాల్

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 4: పట్టణంలోని ప్రభుత్వ బీసీ బాలికల హాస్టల్‌ను అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా.. మెనూ ప్రకారం భోజనం అందుతుందా తదితర విషయాలపై విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. పోచమ్మ గుడి బస్టాప్ వద్ద బస్సులు ఆపడం లేదని విద్యార్థినులు తెలుపగా..డిపో మేనేజర్‌కు అదనపు కలెక్టర్ ఫోన్ చేసి సమస్యను పరిష్కరించారు. హాస్టల్‌లోని వంటగది, స్టోర్ రూమ్‌ను పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ అశ్రిత్ కుమార్, తహసీల్దార్ సలీం పాల్గొన్నారు.

పకడ్బందీగా నిర్వహించాలి

ఓపెన్ స్కూల్ టెన్త్ , ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలపై సంబంధితశాఖల అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ నెల 20వ తేదీ నుంచి 26వ తేదీ వరకు జరగనున్న ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు వివిధ శాఖలకు విధులు కేటాయించినట్లు తెలిపారు. జిల్లాలో ఓపెన్ టెన్త్‌కు సంబంధించి నాలుగు పరీక్షా కేంద్రాల్లో 564 మంది, ఓపెన్ ఇంటర్‌కు సంబంధించి ఐదు పరీక్షా కేంద్రాల్లో 896 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఈవో శ్రీనివాస్‌రెడ్డి, డీఆర్‌వో నాగరాజమ్మ, అధికారులు పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలి

విశ్రాంత శాస్త్రవేత్త బాలకిషన్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కొండపాక(కుకునూరుపల్లి), ఏప్రిల్ 4: విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలని విశ్రాంత శాస్త్రవేత్త బాలకిషన్ అన్నారు. శుక్రవారం కుకునూరుపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఎంఈవో సత్తయ్యతో కలిసి మాట్లాడారు. విద్యార్థులు ప్రతి అంశాన్ని శాస్త్రీయ కోణంలో పరిశీలించాలన్నారు. అనంతరం విశ్రాంత శాస్త్రవేత్తను ఉపాధ్యాయులు సన్మానించి జ్ఞాపిక అందజేశారు.

ఆకునూరువాగు నుంచి ఇసుక అక్రమ రవాణా

- పట్టపగలే రవాణా చేస్తున్న ట్రాక్టర్ల యజమానులు
- డంపును గుర్తించి సీజ్ చేసిన రెవెన్యూ అధికారులు


సుందరయ్యనగర్ సమీపంలో ఇసుక డంపును చూపిస్తున్న గ్రామస్తులు

చేర్యాల, ఏప్రిల్ 4 : మండలంలోని ఆకునూరు వాగు నుంచి కొన్ని రోజులుగా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారు.గ్రామానికి చెందిన కొందరు ట్రాక్టర్ల యజమానులు అనుమతులు లేకుండా చేర్యాల తదితర ప్రాంతాలకు ఇసుక రవాణా చేస్తూ కాసులు సంపాదిస్తున్నారు. ఏదైతే గ్రామంలో వాగు ఉంటుందో సదరు గ్రామంలో జరిగే అభివృద్ధి కార్యక్రమాలు, నిర్మాణాలకు ఇసుక వాడుకో వచ్చనే నిబంధనను అడ్డుగా పెట్టుకుని గ్రామంలో భవన నిర్మాణం కోసం ఇసుక రవాణా చేస్తున్నామంటూ కొందరు ట్రాక్టర్ల యజమానులు గ్రామ సమీపంలోనే ఇసుక డంపు చేస్తున్నారు. పట్టపగలు అనుమతి లేకుండా ఎవరికీ కనిపించని ప్రదేశంలో డంపు చేస్తున్నారు. అర్ధరాత్రి డంపు చేసిన చోటు నుంచి పట్టణ ప్రాంతాలకు ఇసుక తరలించి డబ్బులు సంపాదిస్తున్నారు. శుక్రవారం గ్రామానికి చెందిన పలువురు ఇసుక రవాణా విషయమై అధికారులకు సమాచారం అందించగా, రెవెన్యూ అధికారి అయిలయ్య సదరు ఇసుక డంపును సీజ్ చేశారు. అనంతరం నాయకులు రఘువీర్, శ్రీనివాస్, మహేందర్, సాయికుమార్ మాట్లాడారు.

ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావుకు ఆహ్వానం

రాఘవాపూర్‌లో జరిగే ఉత్సవాలకు రావాలని ఆహ్వానం అందజేస్తున్న గ్రామస్తులు

సిద్దిపేట, ఏప్రిల్ 4: సిద్దిపేట నియోజకవర్గంలో శ్రీరామనవమితో పాటు ఆయా గ్రామాల్లో జరగనున్న ఇతర ఉత్సవాలకు రావాలని ఎమ్మెల్యే హరీశ్‌రావుకు ఆయా దేవాలయాల నిర్వాహకులు ఆహ్వానం పలికారు. సిద్దిపేట రూరల్ మండలం రాఘవాపూర్‌లో పెద్దమ్మ ఉత్సవాలు, నూతనంగా నిర్మించిన లక్ష్మీనృసింహస్వామి ఆలయ విగ్రహ ప్రతిష్ఠ ఈ నెల 9 నుంచి 12 తేదీ వరకు ఉండగా ఆహ్వానం పలికారు. ప్రతిష్ఠ కార్యక్రమానికి ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆలయ నిర్వాహకులకు రూ.లక్ష విరాళం అందజేశారు. పుల్లూరులో ఈ నెల 10 నుంచి 12 వరకు నిర్వహించే లక్ష్మీనర్సింహస్వామి ఉత్సవాలకు ఆహ్వాన పత్రిక అందజేశారు.శ్రీరామ నవమి సందర్భంగా పారుపల్లివిధిలోని సీతారామచంద్రస్వామి ఆలయం, కేసీఆర్‌నగర్‌లోని ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం, లింగారెడ్డిపల్లిలోని అభయ అంజనేయస్వామి దేవాలయం, రాంపూర్‌లోని శ్రీరామాలయం , రేణుకానగర్‌లోని శ్రీ శక్తి అంజనేయస్వామి దేవాలయం, హనుమాన్‌నగర్‌లోని ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం, రాజేంద్రనగర్‌లోని మహఅంజనేయ స్వామి దేవాలయం, గురు దత్తహెల్పింగ్ సొసైటీ ఆధ్వర్యంలో 29వ వార్డులో జరిగే సీతారాముల కల్యాణమహోత్సవానికి రావాలని హరీశ్‌రావుకు ఆహ్వాన పత్రికలు అందజేశారు.

జీవజాతులను పరిరక్షించాలి

సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 4: అంతరించిపోతున్న జీవజాతులను పరిరక్షించి పర్యావరణాన్ని కాపాడాలని నేషనల్ రిమోట్ సెన్సింగ్ సీనియర్ శాస్త్రవేత్త సుధాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జరిగిన జాతీయ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రొఫెసర్ రామనాథన్ మాట్లాడుతూ.. కాలుష్యం కారణంగా సముద్రంలోని జీవజాతులకు ప్రమాదం పొంచి ఉందన్నారు. దేశంలో వివిధ విశ్వవిద్యాలయాల నుంచి పరిశోధన పత్రాలు సమర్పించిన, జాతీయ సదస్సు నిర్వహించిన అధ్యాపకులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత అభినందించారు. అంతకుముందు పర్యావరణ పరిరక్షణ అనే అంశంపై విద్యార్థులు ప్రదర్శించిన గోడ పత్రికను పరిశీలించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. వరల్డ్ వైల్డ్ లైఫ్ ఫండ్ స్టేట్ డైరెక్టర్ పరిధా తంపాల, అధ్యాపకులు హరిబాబు, అయోధ్యరెడ్డి, మధుసూదన్ పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలి

రాయపోల్, ఏప్రిల్ 4: విద్యార్థినులు క్రీడల్లో రాణించాలని గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల విద్యార్థినులకు క్రీడా సామగ్రిని ఆయన అందజేశారు. పాఠశాలలో క్రీడా సామగ్రి లేదని పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్సై రఘుపతి దృష్టికి గతంలో తీసుకొచ్చారు. అయితే అతడి స్నేహితురాలైన ప్రశాంతిరెడ్డి (అమెరికా) దృష్టికి తీసుకువెళ్లారు. ఆమె వెంటనే రూ.10వేల విలుగల ఆట వస్తువులను గజ్వేల్ ఏసీపీ చేతుల మీదుగా విద్యార్థినులకు అందజేశారు. తొగుట సీఐ షేక్ లతీఫ్, ఎస్సై రఘుపతి, ప్రిన్సిపాల్ సుగంధలత, ఆధ్యాపకులు పాల్గొన్నారు.

పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలి

పీస్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న తొగుట సీఐ లతీఫ్

కొండపాక(కుకునూరుపల్లి), ఏప్రిల్ 4 : కుకునూరుపల్లి పీఎస్‌లో శుక్రవారం పీస్ కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి తొగుట సీఐ లతీఫ్ హాజరై మాట్లాడారు. ప్రజలంతా ఒకటిగా ఉండాలని, మతపరమైన వివాదాల జోలికి వెళ్లవద్దన్నారు. శ్రీరామనవమి, హనుమాన్ జయంతి సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్, మత పెద్దలు పాల్గొన్నారు.

కరపత్రం ఆవిష్కరణ

మిరుదొడ్డి,ఏప్రిల్4: బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల రాజ్యాధికారం కోసమే డీఎస్పీ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు విశారదన్ మహరాజ్ కృషి చేస్తున్నారని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రాగట్ల చందు అన్నారు. శుక్రవారం మిరుదొడ్డిలో మా భూమి రథయాత్ర కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 14వ తేదీన ఆదిలాబాద్ జిల్లా కేంద్రం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా లక్ష కిలోమీటర్ల మా భూమి రథయాత్ర నిర్వహిస్తామన్నారు. రథయాత్రలో అయా గ్రామాల ప్రజలు సాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ధర్మసమాజ్ పార్టీ నాయకుడు నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

చెత్త వేరుచేసి వాహన సిబ్బందికి ఇవ్వాలి

హుస్నాబాద్‌టౌన్, ఏప్రిల్ 4: ఇండ్లలోని చెత్తను వేరు చేసి మున్సిపల్ వాహన సిబ్బందికి ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్‌గౌడ్ సూచించారు. హుస్నాబాద్ మున్సిపల్‌కార్యాలయంలో శుక్రవారం బేసిల్‌ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన 3,15వ వార్డుల్లో చెత్తను విభజచేసి సేకరించిన డ్రైవర్ సదానం, సిబ్బంది ప్రభాకర్‌ను కమిషనర్ రాగిబిందె తదితర వస్తువుల కిట్ అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల ఎల్లం, పర్యావరణ అధికారి డి.రవికుమార్, బేసిల్ ఫౌండేషన్ సూపర్‌వైజర్లు నవీన్, సాయి, జవాన్లు సారయ్య, ప్రభాకర్ పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక ఆదాయం

గజ్వేల్, ఏప్రిల్ 4: ఆయిల్‌పామ్ సాగుతో అధిక ఆదాయం పొందవచ్చని ఏడీఏ బాబు నాయక్ రైతులకు సూచించారు. శుక్రవారం మండలంలోని అక్కారంలో రైతు తోట లక్ష్మణ్ సాగు చేసిన ఆయిల్‌పామ్ మొదటి కోత కోసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. పంటసాగు చేసి నాలుగేండ్లు పూర్తయిన సందర్భంగా మొదటి కోతను ప్రారంభించామని, క్వింటాల్‌కు రూ. 21వేలు ఉందన్నారు. మొక్కలు, డ్రిప్ పరికరాలు పంపిణీ చేసి నాలుగేండ్లు పంట యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పిస్తామన్నారు. ఆత్మ కమిటీ చైర్మన్ మల్లారెడ్డి, ఏఈవోలు జ్యోతి, మాధవి, సిబ్బంది గణేశ్ పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి విరాళం

మద్దూరు(ధూళిమిట్ట), ఏప్రిల్ 4: ధూళిమిట్ట మండలంలోని జాలపల్లి ప్రాథమిక పాఠశాల అభివృద్ధి కోసం కృషి చేస్తున్నట్లు గ్రామ మాజీ సర్పంచ్ చొప్పరి వరలక్ష్మీసాగర్ అన్నారు. శుక్రవారం హెచ్‌ఎం హేమచందర్‌కు ఆమె రూ. 5వేల నగదు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలలో వసతుల కల్పనకు తనవంతు సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు. మాజీ సర్పంచ్ బూర గంగాధర్, మాజీ ఉపసర్పంచ్ రాగుల సంపత్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మహనీయుల జయంతి నిర్వహించాలి

చేర్యాల, ఏప్రిల్ 4 : మహనీయులు మహాత్మాజ్యోతిరావు పూలే, బాబా సాహెబ్ అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని పాలకులతో పాటు అన్నివర్గాలు ఘనంగా నిర్వహించాలని తెలంగాణ మాల మహానాడు జనగామ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీరామ్ వెంకటేశ్ కోరారు. శుక్రవారం పట్టణంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 5న జగ్జీవన్‌రావు, 11న జ్యోతిరావుపూలే, 14న అంబేద్కర్ జయంతి ఉందన్నారు. సామాజిక చైతన్యమూర్తుల జయంతికి అందరూ హాజరుకావాలని ఆయన కోరారు.

రైతు సంఘంలో భాస్కర్‌రెడ్డికి చోటు

చేర్యాల, ఏప్రిల్ 4: తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం కమిటీలో మండలంలోని పోతిరెడ్డిపల్లికి చెందిన కత్తుల భాస్కర్‌రెడ్డికి చోటు లభించింది. కత్తుల భాస్కర్‌రెడ్డి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటీవల నిజామాబాద్ జిల్లా కేంద్రంలో జరిగిన తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం మూడో రాష్ట్ర మహాసభలో కత్తుల భాస్కర్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర, జిల్లా, డివిజన్, మండల కమిటీ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శిగా కృష్ణ

గజ్వేల్, ఏప్రిల్ 4: భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శిగా ఆర్అండ్ఆర్ కాలనీలోని పల్లెపహాడ్ గ్రామానికి చెందిన శివలింగు కృష్ణ జిల్లా రెండో మహాసభలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల పక్షాన, ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై తనవంతు పోరాటం చేస్తానన్నారు. కార్మికులకు అందుబాటులో ఉండి సహకారం అందిస్తానన్నారు.

ముదిరాజులపై వివక్ష

సిద్దిపేట, ఏప్రిల్ 4: రేవంత్‌రెడ్డి సర్కార్‌లో ముదిరాజులపై వివక్ష కొనసాగుతున్నదని సుప్రీంకోర్టు అడ్వకేట్ డీఎల్ పాండు ముదిరాజ్ అన్నారు. శుక్రవారం ముస్తాబాద్‌లో జరిగే ముదిరాజ్ సమావేశానికి వెళ్తున్న ఆయన్ను సిద్దిపేట ముదిరాజులు కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్, యూత్ అధ్యక్షుడు అడిగే ప్రశాంత్, జిల్లా నాయకులు వెంకటేశం, పొన్నాల శ్రీనివాస్‌తో కలిసి ఆయన మాట్లాడారు. మాజీ సర్పంచ్‌లు వెంకటేశం, పొన్నాల శ్రీనివాస్, బరిగెల సాయి పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న అడవిపంది

– ముగ్గురికి తీవ్రగాయాలు

చేర్యాల, ఏప్రిల్ 4: అడవిపంది బైక్‌ను ఢీకొట్టడంతో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. చేర్యాల పట్టణ శివారు పల్లె బురాన్‌మియా తోటకు చెందిన తుమ్మ బాబు, తుమ్మ పవన్, తుమ్మ రమేశ్ రోజువారీగా శుక్రవారం చేర్యాల పట్టణానికి వచ్చారు. పనులు పూర్తి చేసుకుని మధ్యాహ్నం బైక్‌పై ఇంటికి తిరిగివెళ్తున్న క్రమంలో చేర్యాల–నర్సాయపల్లి రహదారిలో అడవి పంది దూసుకువచ్చి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బాబు తీవ్రంగా గాయపడగా, పవన్, రమేశ్ కాలు విరిగినట్లు గ్రామస్తులు తెలిపారు. ఘటనా స్థలంలో పడి ఉన్న క్షతగాత్రులను దవాఖానకు తరలించారు.

సన్నబియ్యం పంపిణీ వేగవంతం చేయాలి

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 4: రేషన్ షాపులకు సన్నబియ్యం రవాణా, పంపిణీ వేగవంతం చేయాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి సన్నబియ్యం సరఫరాపై అధికారులతో కలిసి ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రభుత్వం సన్నబియ్యం 84 శాతం జనాభాకు ఉచితంగా సరఫరా చేసే కార్యక్రమం చేపట్టిందన్నారు. రవాణా కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించి సన్నబియ్యం రవాణాపై కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుంచి కలెక్టర్ మనుచౌదరి, అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, డీసీఎస్‌వో తనూజ, డీసీఎస్ డీఎం ప్రవీణ్ పాల్గొన్నారు.

ఉపాధి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం

మిరుదొడ్డి ఏప్రిల్ 4: గ్రామీణ కూలీలకు ఉపాధి హామీ పథకంలో పని కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తున్నదని మిరుదొడ్డి ఎంపీడీవో గణేశ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని మల్లుపల్లి, లింగుపల్లి గ్రామాల్లో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన సందర్శించారు. ఈజీఎస్‌టీఏలు, కూలీలు పాల్గొన్నారు.